క్లుప్తంగా

నేడు పెన్షనర్ల సంఘం సమావేశం

రాయచోటి అర్బన్: రాయచోటి పట్టణంలో ఆదివారం జిల్లా పెన్షనర్ల సంఘం సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వి.రమణ ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఎస్‌జీఓ డైట్ కళాశాలలో ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో పలు సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. అదనపు క్వాంటం పెన్షన్, నూతన పీఆర్‌సీ, ఆయుష్మాన్ భారత్ కార్డులు, క్యాష్‌లెస్ వైద్యసదుపాయం గురించి చర్చిస్తామని పేర్కొన్నారు. ఇటీవల పదవీవిరమణ చేసిన ఉద్యోగులు సమావేశానికి హాజరై సంఘంలో సభ్యులుగా నమోదు చేసుకోవాలని కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విశ్వనాథ్

నందలూరు: ప్రధాన మంత్రి మాతా సురక్షిత అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 35 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించామని ప్రభుత్వ వైద్యాధికారులు డాక్టర్ శరత్ కమల్, డాక్టర్ విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం వారు మాట్లాడుతూ పరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా పంపిణీ చేశామన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ మస్తానమ్మ స్కానింగ్ నిర్వహించి వారు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం ఆశా కార్యకర్తలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకట నారాయణ, సూపర్‌వైజర్ సునీల్ కుమార్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామికి పూజలు


ప్రత్యేక అలంకారంలో వేణుగోపాలస్వామి

పెనగలూరు: మండల కేంద్రమైన పెనగలూరు వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాలస్వామి మూలవిరాట్‌ను తులసీమాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి చంద్రశేఖర్ శర్మ, గ్రామ పురోహితుడు చెంచు సుబ్బన్న పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

భక్తులకు అన్నదానం


భక్తులకు అన్నదానం చేస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. శ్రావణ మాసం కావడంతో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామికి, అమ్మవారికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. రంగు రంగుల పూలు, పట్టు వస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. కార్తీక మాసం కావడంతో స్థానిక భక్తులతో పాటు కన్నడ భక్తులు విశేషంగా తరలివచ్చారు. భక్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి ఉచితంగా భోజనం అందజేశారు.

ఘనంగా గోపూజ


అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

ఓబులవారిపల్లె: గోకులాష్టమి సందర్భంగా శనివారం మంగంపేట పులపత్తూరి సుదర్శన్ రెడ్డి గోశాలలో భక్తిశ్రద్ధలతో గోపూజ నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పి. రామసుబ్బారెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రేకుల షెడ్లను తొలగించండి



ఆక్రమణ స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

గాలివీడు : గాలివీడులోని నాలుగురోడ్ల కూడలిలో ఆర్ అండ్ బీ స్థలంలో అనుమతి లేకుండా నిర్మించిన రేకుల షెడ్లను రెండు రోజుల్లో తొలగించాలని ఆర్‌అండ్‌బీ డీఈ వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం గాలివీడులోని నాలుగురోడ్ల కూడలిలో అక్రమణకు గురైన స్థలాన్ని స్థానిక పోలీసులతో కలసి ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 2,266 లోని 1.80 సెంట్లు భూమి ఉందని, కూడలికి పోను మిగిలిన స్థలంలో కాంప్లెక్స్ నిర్మిస్తామని తెలిపారు.

రైతన్నకు ఏదీ భరోసా?

- పెట్టుబడి సాయం ఊసెత్తని కూటమి సర్కార్
- అందని ప్రభుత్వ రాయితీ, పరికరాలు
- విత్తనాలు, ఎరువులకు తప్పని పాట్లు

రైతులకు పెట్టుబడుల సాయం ఎండమావిగా మారింది. అన్నదాతకు భరోసా ఇచ్చే చేయి కనిపించడం లేదు. రబీ, ఖరీఫ్ సీజన్లలో పెట్టుబడుల కోసం రైతులు ఇబ్బందులు పడకుండా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా మొత్తం అందేది. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసినా రైతులకు ప్రభుత్వ సాయం అందలేదు.


గాలివీడులో సాగు చేసిన వేరుశనగ

గాలివీడు : రైతన్నలను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ ఏడాదిలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు పెట్టుబడి సాయం ఇస్తామన్న కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకం ఊసే ఎత్తడం లేదు. అదేవిధంగా రాయితీలపై ఇచ్చే వ్యవసాయ పనిముట్లు రైతులకు దరిచేరడం లేదు. ఖరీఫ్‌లోనూ కలుపు నివారణ మందులు, పంటలను పిచికారీ చేసే స్ప్రేయర్లు ఇలా రైతులకు కనీస అవసరాలు కూడా కల్పించడం లేదు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో విత్తనాల కోసం ఎన్ని రోజులు ఎదురుచూసినా ఎరువుల కోసం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం కనీస భరోసా కల్పించలేకపోతోంది. దీంతో సాగు కష్టాలు తప్పడం లేదు. రైతన్నకు మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో 5,000 ఎకరాల్లో వేరుశనగ, 1,000 ఎకరాల్లో కంది, 2,000 ఎకరాల్లో వరి, 500 ఎకరాల్లో కూరగాయల పంటలు సాగు చేశారు. పురుగు మందులు పిచికారీ చేసేందుకు రైతులకు స్ప్రేయర్లు లేక ఇబ్బందులు పడుతున్నారు. పంట సాగు సమయంలో రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని కర్షకులు వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆరంభంలోనే సాయం

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పకడ్బందీగా రైతు భరోసా పథకం అమలు చేసేది. సీజన్ ప్రారంభంలోనే పెట్టుబడికి అన్నదాతలు ఏమాత్రం ఇబ్బందులు పడకుండా రైతు భరోసా మొత్తాన్ని రైతు బ్యాంకు ఖాతాలో జమ చేసేది. పీఎం కిసాన్ కింద రూ. 6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.7,500 కలిపి మొత్తం ఏడాదికి రూ. 13,500 విడతల వారీగా నేరుగా అన్నదాతల ఖాతాల్లో జమ చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే.

అన్నదాత సుఖీభవ ఎప్పుడు?

సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో అన్ని వర్గాల ప్రజలను మభ్యపెట్టారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా పెట్టుబడి సాయంగా ఏడాది రూ.20 వేలు రైతు ఖాతాలో జమ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటివరకు అమలు చేయలేదు. ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు చేసినా నేటికీ పెట్టుబడి సాయం ఊసెత్తడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం నిధులు విడుదల చేసినా కూటమి ప్రభుత్వం ఎందుకు నిధులు మంజూరు చేయడం లేదో అర్థం కావడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ఆదుకోవాలి



ఎన్నికల సమయంలో కూటమి నాయకులు రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు రూ. 20 వేలు సాగు సమయంలో పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా పెట్టుబడి సాయంపై ఎటువంటి ప్రకటన చేయలేదు. ఖరీఫ్ సీజన్‌లో పంటల పెట్టుబడికి అప్పు చేసి వ్యవసాయం చేస్తున్నాం.

– నరసింహారెడ్డి, రైతు, అరవీడు

అధిక ధరలతో కొనుగోలు



రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్ప్రేయర్లు, స్ప్రింకర్లు, ఇతర వ్యవసాయ పనిముట్లు రాయితీపై సరఫరా చేయకపోవడంతో ప్రైవేటు వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేసుకుంటున్నాం. రైతుకు వ్యవసాయ పనిముట్లతో ఎంతో అవసరం ఉంటుంది. కనీసం 50 శాతం సబ్సిడీతో పనిముట్ల సరఫరా చేయాలి. కూటమి రైతుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అన్నదాతలకు ప్రభుత్వం ఆదుకోవాలి.

– రాజేష్‌నాయుడు, రైతు, అరవీడు

అనుమతి రావాలి

రైతులకు రాయితీపై ఇచ్చే పనిముట్లు ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు తమవంతుగా తోడ్పాటు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం. రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు రాయితీపై విక్రయిస్తున్నారు. కొద్దిరోజుల్లో ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాక రాయితీపై పనిముట్లను కూడా రైతులకు అందిస్తాం.

– వెంకటరమణారెడ్డి, ఏఓ, వ్యవసాయశాఖ, గాలివీడు

అయ్యప్ప దీక్ష.. ఆరోగ్య రక్ష

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి


మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న గురుస్వాములు

రాయచోటి (జగదాంబసెంటర్) : అయ్యప్ప దీక్ష ఆరోగ్య రక్ష అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటి పట్టణం సుద్దలవాండ్లపల్లె రహదారి మార్గం అయ్యప్ప గుడి (మణికంఠ గిరి)లో జరిగిన ప్రత్యేక పూజలలో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎస్‌ఎంబీ టైల్స్ ఓనర్ లోకేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ స్వాములకు జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప మాలధారణ నియమాల తోరణమన్నారు. చిన్నా పెద్ద అని తేడా లేకుండా ప్రతి వ్యక్తిని దైవ స్వరూపంగా భావించడమే దీక్ష పరమార్థమని పేర్కొన్నారు. ఆధ్యాత్మిక చింతన పెరగడమే కాకుండా దురలవాట్లకు దూరమై సంపూర్ణ ఆరోగ్యం క్రమశిక్షణతో కూడిన జీవన విధానం, ధార్మిక భావాలు అలవడుతాయని చెప్పారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించిన లోకేశ్వరరెడ్డిని శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప సేవా సొసైటీ అధ్యక్షుడు బసిరెడ్డి స్వామి, ట్రెజరర్ మల్లన్నస్వామి, మండల బీసీ నాయకులు పల్లపు రమేష్, జానం రవీంద్రయాదవ్, బీసీ సెల్ విజయభాస్కర్, సుగవాసి శ్యామ్, కొత్తిమీర ప్రసాద్, రంగారెడ్డి పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించండి


సమావేశంలో ఎంపీపీ సుధామాధురి


సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

చిన్నమండెం : అధికారులు, ప్రజాప్రతినిధులు పార్టీలకతీతంగా పనిచేసి మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ సుధామాధురి కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవన్‌లో ఎంపీపీ సుధామాధురి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, కొన్ని ప్రాంతాల్లో పైపు లైన్ లీకేజీలతో నీళ్లు రావడం లేదని స్థానికులు తన దృష్టికి తెచ్చారని తెలిపారు. లీకేజీలను అరికట్టి నీటిని అందరికీ సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ హరినాథరెడ్డికి సూచించారు. అధికారులందరూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం ఉపాధి హామీ ఏపీఓ మాధవి మాట్లాడుతూ పండ్ల తోటలకు, గోకులాలకు సంబంధించి పనుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుంటే.. ఏప్రిల్ నుంచి పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

నిధులు మంజూరు

ఆర్‌అండ్‌బీ జేఈ ధర్మారెడ్డి మాట్లాడుతూ బోనమల రోడ్డుకు రూ.5 లక్షలు, కలిబండ రోడ్డు మరమ్మతులకు రూ.14 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అదే విధంగా మండలంలో 48 వర్కులకు రూ.1.18 కోట్లు మంజూరైందని, ఇందులో 24 వర్కులను ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా ప్రతి గ్రామానికి నీటి ట్యాంకర్లు బిగిస్తామని, ఎక్కడున్నా బోర్లు మరమ్మతులుంటే 24 గంటలలోపు మరమ్మతులు చేస్తామని పేర్కొన్నారు. అనంతరం వెటర్నరీ డాక్టర్ గణేష్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా పశువులకు గాలికుంటు వ్యాధి, చర్మవ్యాధులకు సంబంధించి టీకాలు వేసినట్లు తెలిపారు. ఎంఈఓ ఆంజనేయులునాయుడు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి వారి పాఠశాల వద్దకే వచ్చి ఆధార్‌లో తప్పు ఒప్పులను సరిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మోడెం జయమ్మ, మండల ఉపాధ్యక్షుడు ఆలీఖాన్, కోఆప్షన్ మెంబర్‌గౌస్‌సాబ్, ఎంపీటీసీలు రమేష్, శ్యామ్, వెంకటప్పనాయుడు, జయమ్మ, తులసమ్మ, సర్పంచులు లోకేశ్వరరెడ్డి, లక్ష్మీరెడ్డి, జగన్నాథరెడ్డి, నజీర్ అహమ్మద్, నజీర్‌బాషా, మండల అధికారులు, అఫ్రోజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


దీక్షా పరులకు భిక్ష అందజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

రాజంపేట రూరల్: ఆధ్యాత్మిక మార్గంలో పయనించడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అన్నారు. పట్టణంలోని ఆకేపాటి భవన్ సమీపంలో నివాసం ఉంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్త కొత్త రాజా, వెంకటేశ్వరస్వామి దీక్ష చేపట్టారు. ఈ నేపథ్యంలో శనివారం దీక్ష పరులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి స్వాములకు స్వయంగా భిక్ష అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేతామూర్తుల దీక్షలు చేపట్టిన వారికి భిక్ష అందజేయటం గొప్ప పుణ్యకార్యమని పేర్కొన్నారు. అదే విధంగా మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో శ్రీఅయ్యప్పస్వామి దీక్ష వహించిన దీక్షా పరులకు ఎమ్మెల్యే ఆకేపాటి స్వయంగా భిక్ష అందజేశారు. ప్రతి ఒక్కరూ ప్రతి మనిషిలోను దైవాన్ని చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు ఆకేపాటి అనిల్‌కుమార్‌రెడ్డి, దండు గోపీ, దాసరి పెంచలయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాష కోసం పరితపించిన సీపీ బ్రౌన్


సీపీ బ్రౌన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న తెలుగుభాషా సంరక్షణ సమితి ప్రతినిధులు

రాజంపేట టౌన్: తెలుగుభాషా సాహిత్యం, అభివృద్ధికి సీపీ బ్రౌన్ ఎంతగానో పరితపించారని తెలుభాషా సంరక్షణ సమితి ప్రతినిధులు కొనియాడారు. ఈ నెల 10వ తేదీ సీపీ బ్రౌన్ జయంతిని పురస్కరించుకొని స్థానిక సరస్వతీ విద్యామందిరం పాఠశాలలో శనివారం ముందస్తుగా ఆయన జయంతి వేడుకను తెలుగుభాషా సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సమితి ప్రతినిధులు మాట్లాడుతూ బ్రౌన్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఉద్యోగిగా విధులు నిర్వహించేందుకు ఆంధ్ర ప్రాంతానికి వచ్చి కడపలో నివసించి తెలుగుభాషాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. ప్రతి ఒక్కరూ భాషాభిమానాన్ని చూపి తెలుగు భాషను కాపాడుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగుభాషా సంరక్షణ సమితి ప్రతినిధులు గంగనపల్లె వెంకటరమణ, బొట్టా రామచంద్రనాయుడు, బీవీ నారాయణరాజు, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

పసుపులేటి శంకర్‌కు ఆహ్వానం

నందలూరు: తెలుగు భాషాభివృద్ధి కృషి చేసిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ 226 జయంతి వేడుకలకు రాజంపేట స్పెషల్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్‌ను ప్రధాన వక్తగా యోగివేమన విశ్వవిద్యాలయం ఆహ్వానించింది. ఈ సందర్భంగా శనివారం శంకర్ మాట్లాడుతూ ఈనెల 10న ఆదివారం ఉదయం 10 గంటలకు కడప సీపీ బ్రౌన్ పరిశోదన కేంద్రం గ్రంథాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో యోగివేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా, డాక్టర్ పద్మ, కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రఘునాథరెడ్డి, విశ్రాంత ప్రధానాచార్యులు డాక్టర్ సంజీవమ్మ, ప్రముఖ కవి ఎలమర్తి మధుసూదన్, సాహితీ వేత్త ప్రతాప్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు.

ఆకస్మిక తనిఖీ

సిద్దవటం: సిద్దవటం రేంజ్ రోళ్లబోడు బేస్ క్యాంపును శనివారం వైఎస్ఆర్ జిల్లా బద్వేల్ సబ్ డీఎఫ్‌ఓ బి. స్వామి వివేకానంద ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గొల్లపల్లె ఫారెస్టు సెక్షన్ స్టాఫ్‌తో కలిసి రోళ్లబోడు, గొల్లపల్లె, సిద్దవటం బీట్లలో ఎర్రచందనం స్మగ్లర్ల ఆచూకీ కోసం కూంబింగ్ నిర్వహించారు. అంతేగాక సిబ్బందికి ఎర్రచందనం పరిరక్షణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రేంజర్ కళావతి, డిప్యూటీ రేంజర్ ఓబులేసు, ఎఫ్‌బీఓలు పెంచల్‌రెడ్డి, ఆది విశ్వనాథ్, మధు, రోళ్లబోడు, సిద్దవటం బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పూజలు

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని రాయచోటి–వేంపల్లి రహదారి మార్గంలో వెలసిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంతో పాటు విశ్వభారతి హైస్కూల్ సమీపంలోని శివాలయం, ఆంజనేయ స్వామి ఆలయం, రామాపురం రోడ్డు మార్గంలోని నామాల గుట్టపై వెలసిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో, మద్దిరేవుల, ఈడిగపల్లె సమీపంలో వెలసిన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయాలలో శనివారం స్థానికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నామాల గుట్టపై అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఆరోగ్య పరీక్షలతో తల్లీబిడ్డ క్షేమం

పీలేరు : క్రమం తప్పకుండా గర్భిణులు పరీక్షలు చేయించుకోవడం ద్వారా తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారని డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని తలపుల పీహెచ్‌సీలో పీఎంఎస్ఎంఏ కార్యక్రమం నిర్వహించి గర్భిణులకు పరీక్షలు చేసి, సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో ఉచితంగా నాలుగు రకాల పరీక్షలు, రెండు టీడీ సూది మందులు, 180 ఐఎఫ్ఏ మాత్రలు లభిస్తాయని పేర్కొన్నారు.

భద్రకాళీ సమేతుడిని దర్శించుకున్న జిల్లా జడ్జి


శ్రీ భద్రకాళీ సమేతుడి సన్నిధిలో న్యాయమూర్తి ప్రత్యూష

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని వైఎస్సార్ జిల్లా కోర్టు సివిల్ జడ్జి ప్రత్యూష దర్శించుకున్నారు. శనివారం ఆమె ఆలయానికి రాగానే ఆలయ ఈఓ డి.వి. రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ వినాయకుడు, అఘోరలింగేశ్వరుడు, శ్రీ వీరభద్ర స్వామి, శ్రీ భద్రకాళీ అమ్మవారికి ఆమె పేరున అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తికి స్వామి వారి చిత్రపటాన్ని బహూకరించి ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టతను, స్థల పురాణాన్ని వివరించారు.

నేడు చిట్వేలిలో ఉచిత వైద్యశిబిరం

చిట్వేలి: శ్రీసాయి వికాస్ హైస్కూల్‌లో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు డాక్టర్ శ్రీకృష్ణా హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఇందులో జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఎముకలు, కీళ్లు, చెవి, ముక్కు, గొంత, యూరాలజీ వంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

తంబళ్లపల్లె: వ్యవసాయ కూలీలతో వెళుతున్న ఆటో ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. బాధితుల కుటుంబీకుల కథనం మేరకు... గోపిదిన్నెకు చెందిన పెద్దరెడ్డప్ప(60), కాంతారావు(60) పొలం నుంచి ఇంటికి వస్తుండగా ములకలచెరువు నుంచి వ్యవసాయకూలీలతో వస్తున్న ఆటో గోపిదిన్నె సమీపంలో ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ద్విచక్రవాహనంలో ఉన్న పెద్దరెడ్డప్ప, కాంతారావులకు తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరికి కుడి కాళ్లు విరిగాయి. గుర్తించిన స్థానికులు 108 వాహనంకు సమాచారం అందించి తంబళ్లపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెడికల్ ఆఫీసర్ తేజస్వి ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మదనపల్లెకు తీసుకెళ్లాలని వైద్యులు సూచించారు.

డ్వాక్రా సంఘాల వివరాలు నమోదు చేయాలి


అవగాహన కల్పిస్తున్న ఏపీఎం దేవసేన

రామాపురం: మండలంలోని స్వయం సహాయక సభ్యులకు సంబంధించిన వివరాలు ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెర్ప్ యాప్‌లో నమోదు చేయాలని మండల స్వయం సహాయక సంఘం ఏపీఎం దేవసేన కోరారు. మండల కేంద్రంలోని స్వయం సహాయక కార్యాలయంలో సీసీలు, యానిమేటర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి గ్రామంలో స్వయం సహాయక గ్రూపులకు సంబంధించిన లబ్ధిదారులకు ఒక్కో సంఘంలో పది మంది సభ్యులు ఉంటారని, ఆ సభ్యులకు సంబంధించిన వివరాలు స్థానిక వీఓఏలు ప్రతి సంఘం సభ్యురాల వద్దకు వెళ్లి సెర్ప్ యాప్‌లో కుటుంబ వివరాలు, తలసరి ఆదాయం, గ్యాస్ కనెక్షన్ వివరాలు పొందుపరచాలని చెప్పారు. డ్వాక్రా సంఘాల్లో బ్యాంకు, శ్రీనిధి రుణాలు క్రమం తప్పకుండా చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీసీలు ఆదినారాయణ, నాగరాజు, నరసింహులు, గంగాధర్‌రెడ్డి, బాబు పాల్గొన్నారు.

స్కూటీ- స్కూటర్ ఢీ

– నలుగురికి గాయాలు


ఘటనాస్థలిలో విచారిస్తున్న పోలీసులు

రాయచోటి టౌన్ : స్కూటీ – స్కూటర్ ఢీకొన్న సంఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం రాయచోటి రూరల్ పరిధిలోని రాజంపేట రోడ్డులోని ఎగువ తూముల వద్ద స్కూటర్, స్కూటీ రెండు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో సుండుపల్లె మండలం మల్లప్పగారి పల్లెకు చెందిన జి.గంగాధర్, స్వరూప, ఏడు నెలల చిన్నారిని (బాలుడు) స్కూటీపై రాయచోటిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించుకొని తిరిగి ఇంటికి వస్తున్నారు. అదే సమయంలో ఓదివీడు గ్రామం కావలి పల్లెకు చెందిన దయ్యాల వెంకటేశ్వర్లు స్కూటర్‌పై రాయచోటికి వెళ్లుతుండగా ఈ సంఘటన జరిగింది. ఈ ఘటనలో నలుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు 108 ద్వారా రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు ప్రాథమిక వైద్యం చేసి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు రాయచోటి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబసభ్యులను విచారించి కేసు నమోదు చేశారు.

హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మృతి

పెనగలూరు: పెనగలూరు మండల హౌసింగ్ ఇన్‌స్పెక్టర్ రఫత్ మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. రఫత్ అనారోగ్యంతో తిరుపతిలోని ఆసుపత్రిలో శనివారం చికిత్సపొందుతూ మృతి చెందారు. ఈమె 2006వ సంవత్సరం నుంచి హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రఫత్ కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

పారిశుద్ధ్యం.. అస్తవ్యస్తం

- రోడ్లపై చెత్తాచెదారం
- వ్యాధులు ప్రబలుతాయని ప్రజల్లో ఆందోళన
- పట్టించుకోని పాలకులు, అధికారులు


రోడ్డుపై పేరుకుపోయిన చెత్తా


అంకమ్మనగర్ స్కూల్ వద్ద పేరుకు పోయిన చెత్తాచెదారం

రైల్వేకోడూరు అర్బన్: పట్టణంలో పారిశుద్ధ్యం పడకేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉన్నా పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోయింది. ఇటీవల కురిసిన వర్షానికి అది మొత్తం తడిసిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని పాలకవర్గాలు, అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇటీవల వర్షాలు కురవడంతో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. విషజ్వరాలతో చిన్నారుల నుంచి పెద్దల వరకూ అల్లాడుతున్నారు. ప్రభుత్వ ప్రైవేటు ఆస్పత్రులు జ్వర పీడితులతో కిటకిట లాడుతున్నాయి. పట్టణంలోని రంగనాయకులపేట, దర్మాపురం, చిట్వేలిరోడ్డు, అంకమ్మనగర్, పాతబజార్, ఉంగరాలనగర్, తపాళా కార్యాలయం వెనుక వీధి తదితర ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉంటుంది. డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవటంతో నీరంతా రోడ్ల మీదకే చేరుతుంది. మురుగు పచ్చగా మారి దోమలు వృద్ధి చెందటంతో పాటు దుర్వాసన వెదజల్లుతోంది. పంచాయతీ పాలకులు, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవటం లేదని, ఇటీవల కురిసిన వర్షాలకు తమ బాధలు వర్ణనాతీతమని కనీసం బ్లీచింగ్ కూడా చల్లటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

పట్టణం, గ్రామాల్లో అధికారుల నిర్లక్ష్యంతోనే జ్వరాలు అధికమవుతున్నాయి. స్థానిక అధికారుల, సర్పంచ్‌లు సమన్వయంతో పని చేయకపోవడంతో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. పట్టించుకోవాల్సిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పల్లెల వైపు కన్నెత్తి చూడడం లేదు. సీజనల్ వ్యాధులైన డెంగీ, మలేరియా వంటివి వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి



పాపారిశుద్ధ్య నిర్వహరణ సరిగా లేక దోమలు విజృంభిస్తున్నాయి. దోమల వలన జ్వరాలు వస్తున్నాయి. వీధుల్లో రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ చెత్త పేరుపోయింది. ఇటీవల కురిసిన వర్షాలకు చెత్త కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు పారిశుద్ధ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి.

– కాకర్ల చంద్రశేఖర్‌రెడ్డి, రాఘవరాజుపురం, రైల్వేకోడూరు

జాగ్రత్తలు తీసుకోవాలి



పరిసరాలను అందరూ పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దోమలను నివారించేందుకు దోమతెరలు తప్పకుండా వాడాలి. ప్రతి రోజు కాచిన నీరు తాగాలి. జ్వరం లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ బ్రహ్మకుమారి, ప్రభుత్వవైద్యాధికారి, రైల్వేకోడూరు